


# కరపత్రం

SINCE 2014

బుధవారం జనవరి 7, 2026 | సంపుటి : 2 | సంచిక : 93 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

# 75 రోజుల్లో
## గోదావరిఖనిలో క్యాత్ ల్యాబ్



**హైదరాబాద్:**
సింగరేణి కార్మికుల సంక్షమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. 75 రోజుల్లో గోదావరిఖనిలో క్యాత్ ల్యాబ్ ప్రారంభిస్తామని చెప్పారు. సింగరేణిపై శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. "32 మంది వైద్యుల కోసం నోటిఫికేషన్ ఇచ్చాం. త్వరలో భర్తీ చేస్తాం. 176 మంది పారామెడికల్ సిబ్బంది నియామక ప్రక్రియ జరుగుతోంది. సింగరేణి ఆస్పత్రుల్లో మార్చి నాటికి వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తాం. విశ్రాంత ఉద్యోగులు అక్కడ మందులు అందించేలా చర్యలు చేపడతాం" అని భట్టి విక్రమార్క తెలిపారు.

# కాలుష్య నివారణకు ఇవి పాలసీ అమలు

» ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు
» ఈవి వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల పెంపునకు చర్యలు
» అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి


2 లో

**హైదరాబాద్,జనవరి6 :**
ఈవి వాహనాల బ్యాటరీల సామర్థ్యం పెంపునకు కంపెనీలు చర్యలు చేపట్టాయని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈవి పాలసీ కింద తయారీదారులు, డీలర్లతో భేటీ ఏర్పాటు చేశామని అన్నారు. ఈవి వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్య పెంపునకు చర్యలు ఉంటాయన్నారు. మంగళవారం శాసనసభలో పొన్నం మాట్లాడుతూ.. ఈవీ వాహనాల రాయితీ అమలుతో రూ.900 కోట్ల పన్ను నష్టం అని.. ఉద్యోగులు ఈవి వాహనాలు కొనుగోలు చేస్తే 20 శాతం తగ్గింపు ఉంటుందని పొన్నం తెలియజేశారు. ఉద్యోగులకు 20 శాతం వరకు తగ్గించాలని కంపెనీలను కోరామని అన్నారు. ఎంఎన్ సి కంపెనీలు ఈవి వాహనాలు కొనుగోలు చేసేలా విధానం ఉంటుందని, పిఎం ఈ డ్రైవ్ కింద 575 ఆర్టిసి బస్సులు నడుస్తున్నాయని చెప్పారు. కొత్తగా 200కు పైగా ఈవి బస్సులు వస్తున్నాయని, వరంగల్ లో 100, నిజామాబాద్ లో 50 బస్సులు వస్తున్నాయని పేర్కొన్నారు. 15 ఏళ్ల దాటిన వాహనాలను స్క్రాప్ చేయాలని, స్క్రాప్ పాలసీ కింద ప్రోత్సాహం ఇచ్చేలా జివో తీసుకువచ్చామని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఈవీ పాలసీని తీసుకువచ్చామని, ఈ ఏడాది కాలంలో లక్ష ఈవీ వాహనాలు అమ్ముడయ్యాయని వెల్లడించారు.

# 10 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు
## తెలంగాణ ప్రభుత్వం ప్రకటన




**హైదరాబాద్,జనవరి6:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి సెలవులను ప్రకటించింది. జనవరి 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అన్ని పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇస్తున్నట్లు ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. ఈ సెలవులు ప్రభుత్వ, ప్రైవేటు, వాణిజ్య పాఠశాలలకు వర్తిస్తాయని పేర్కొంది. జనవరి 16వ తేదీన కనుమ రోజును పురస్కరించుకుని ఐచ్ఛిక సెలవు కూడా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. కనుమ రోజున రైతులు తమ పండుగను ప్రత్యేకంగా చేసుకుంటారు. కనుమ రోజున ఉత్సవాలు, పండుగ సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జనవరి 17వ తేదీ నుంచి అన్ని పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయని స్పష్టం చేసింది. ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులను తమ ఇళ్లకు తీసుకురావడానికి తల్లిదండ్రులు ప్లాన్ చేసుకుంటున్నారు.



2 లో

# తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు లైన్ క్లియర్

**హైదరాబాద్:**
తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు లైన్ క్లియర్ అయ్యింది. తెలంగాణ శాసనసభలో మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. 2019 మున్సిపల్ చట్టంలో కీలక మార్పు చేస్తూ బిల్లుకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఓటర్ల జాబితా సవరణకు 60 రోజుల ముందే సమాచారం ఇవ్వాలన్న నిబంధన తొలగించారు.
దీంతో భారత ఎన్నికల సంఘానికి ముందస్తు సమాచారం అవసరం ఇక లేదు. ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ ప్రారంభం కాగా, ఈ నెల 10న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.

# ఎపి ట్రాప్‌లో కాంగ్రెస్ పడిపోతోంది

- ♦ మా హయాంలోనే 90శాతం పనులు పూర్తి
- ♦ పదిశాతం పనులు పూర్తి చేస్తే నీళ్లు వాడుకోవచ్చు
- ♦ పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై బిఆర్ఎస్
- ♦ కొత్త ప్రాజెక్టు కడితే ఎప్పటికి పూర్తవుతుందో ?
- ♦ రిజర్వాయర్లను సందర్శించిన బిఆర్ఎస్ నేతలు
- ♦ కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి నిరంజన్ రెడ్డి



**మహబూబ్‌నగర్,జనవరి6 :**
పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 10 శాతం పనులను పూర్తిచేస్తే నీళ్లను వాడుకోవచ్చని మాజీమంత్రి, బిఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు కొత్త ప్రాజెక్టు కడితే ఎప్పటికి పూర్తవుతుందని ప్రశ్నించారు. ఏపీ ట్రాప్‌లో కాంగ్రెస్ నేతలు పడిపోవద్దన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులు 90 శాతం పూర్తయ్యాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. రూ.32 వేల కోట్ల పనులు బీఆర్ఎస్ పూర్తి చేసిందని తెలిపారు. రూ.27 వేల కోట్ల బిల్లులు చెల్లించామని పేర్కొన్నారు. కేసీఆర్ వచ్చాక తెలంగాణ నీటి లభ్యత గురించి తెలియజేశారని అన్నారు. ముందే అప్రమత్తమైతే తెలంగాణ నీటి వాటాను కోల్పోయేది కాదని అభిప్రాయపడ్డారు. పాలమూరులో పడావు పడ్డ ప్రాజెక్టులపై గులాబీ పార్టీ సమరభేరీ మోగించింది. ఈ క్రమంలో జూరాల ప్రాజెక్టును మాజీ మంత్రులు నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం సందర్శించింది. మిగతాద్ది 2 లో


2లో..

# కెసిఆర్‌ను కాదు.. రాహుల్‌ను ఉరితీయాలి

▪ అది గౌరవ సభ కాదు...కౌరవ సభ ▪ అసెంబ్లీ తీరుపై మండిపడ్డ కెటిఆర్

**జనగామ,జనవరి6 :**
తెలంగాణ అసెంబ్లీ నడుస్తున్న తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాట్ కామెంట్స్ చేశారు. అసెంబ్లీ గౌరవ సభ కాదని.. కౌరవ సభ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.



# పాలమూరు మళ్లీ దివాలా తీసేలా కుట్రలు

కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ శ్రీనివాస గౌడ్

02

**మహబూబ్‌నగర్,జనవరి6 :**
ఉమ్మడి ఏపీలో అత్యంత దారుణంగా నష్టపోయిన జిల్లా పాలమూరు అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

# 2047 నాటికల్లా
## 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం

» అందుకు అనుగుణంగా పెట్టుబడులకు ప్రోత్సాహం
» మండలిలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



**హైదరాబాద్,జనవరి6 :**
తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికల్లా 3 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలనే దృఢమైన సంకల్పంతో ముందుకు సాగుతున్నామని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగానే పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. శాసనమండలిలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారులకు సులువుగా ఉండే విధంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానాన్ని తీసుకొచ్చా మన్నారు.

2లో..



# అశాస్త్రీయంగా జిల్లాల ఏర్పాటు

» అసెంబ్లీలో చర్చించి సరిచేస్తామన్న పొంగులేటి

**హైదరాబాద్,జనవరి6 :**
తెలంగాణలో గత ప్రభుత్వం జిల్లాలు, మండలాలను అశాస్త్రీయంగా,అసంబద్ధంగా రూపొందించిందని రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. దీనిని సవరించాల్సి ఉందన్నారు.


2 లో

# హిల్ట్ పాలసీలో లోపాలు సవరించాలి

» పరిశ్రమలను మూసేసేలా ప్రభుత్వ విధానాలు
» బిజెపి శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి విమర్శలు

**హైదరాబాద్,జనవరి6 :**
హిల్ట్ పాలసీకి సంబంధించి సబ్ కమిటీ నిర్ణయాలను ఎందుకు బయట పెట్టలేదని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు.

# డిజిటల్ డిపాజిట్ల మోసం.. ఫాల్కన్ ఎండీ అమర్‌దీప్ అరెస్ట్

**హైదరాబాద్:**
ఫాల్కన్ ఎండీ అమర్‌దీప్‌ను తెలంగాణ సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. ముంబయిలో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే అమర్‌దీప్‌పై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి.


2లో

# వరంగల్ కోట భూ ఆక్రమణలు తొలగించండి

» కోట తెలంగ్నాణ వారసత్వ సంపద
» సీఎం రేవంత్‌రెడ్డి కి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ

**న్యూఢిల్లీ,జనవరి6 :**
తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి కి షన్‌రెడ్డి మంగళవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు.


02

# మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుదాం

▪ పార్టీ కేడర్‌కు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పిలుపు

**సంగారెడ్డి,జనవరి6 :**
రానున్న మున్సిపల్ ఎన్నికల్లో సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాల్టీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పార్టీ కేడర్‌కు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి


02

# ఎపి ట్రాప్‌లో కాంగ్రెస్ పడిపోతోంది

మొదటి పేజీ తరువాయి

నార్లపూర్ పంప్‌హౌజ్, రిజర్వాయర్, వ్టటెం పంప్‌హౌజ్, కరివెన రిజర్వాయర్లను సందర్శించారు. ప్రాజెక్టులను పడావు పెట్టిన ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. జూరాలకు సరాసరి 25 రోజులు వరద వస్తుందని అన్నారు. జూరాల ప్రాజెక్టు కడితే తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. 3 లక్షల పైచిలుకు జనం ముంపునకు గురవుతారని పేర్కొన్నారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తయి అన్ని రిజర్వాయర్లను నింపితే 68 టీఎంసీల నీళు వస్తాయని తెలిపారు. అవసరమైతే మళ్లీ నీళ్లను నింపుకోవచ్చని అన్నారు. దీనివల్ల ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. తెలంగాణ నీళ్లను వాడుకుంటే ఇబ్బందని జూరాల ప్రాజెక్టు తీసుకొచ్చారని మండిపడ్డారు. జూరాల ప్రాజెక్టును కాంగ్రెస్ నాయకులు 40 ఏళ్ల నుంచి ప్రజలకు చూపిస్తున్నారని నిరంజన్ రెడ్డి తెలిపారు. జూరాల నుంచి నీళ్లు తీసుకోవడం అంటే పాలమూరుకు నీళ్లు వద్దని చెప్పడమే అని స్పష్టం చేశారు. ఇంత చేసినా జూరాల వద్ద నీళ్లుండవని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మంచిని తక్కువ చేసి చూపించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఏం కోల్పోయామో అర్థమైతే ఎప్పటికీ మిమ్మల్ని క్షమించరని హెచ్చరించారు. చరిత్రలో కాంగ్రెస్‌కు స్థానమే ఉండదని.. ఎప్పటికైనా చరిత్రలో నిలిచేది కేసీఆరే అని స్పష్టం చేశారు. దొంగ మాటలు, మోసాలతో ప్రజలను ముంచాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి జీవో 24ను ఒకసారి చదువుకోవాలని సూచించారు. 90 శాతం పనులు పూర్తయిన ప్రాజెక్టును ఆపడమేంటని ఆయన ప్రశ్నించారు. తట్టెడు మట్టి తీయకుండానే బీఆర్ఎస్ ప్రభుత్వంపై అబద్దాలు ఆడుతున్నారని మండిపడ్డారు. అనేక కేసులు వేసి ఏపీ ప్రభుత్వానికి కాంగ్రెస్ నాయకులు సహకరించారని ఆరోపించారు. జూరాల నుంచి పాలమూరుకు నీళ్లు అంటేనే పెద్ద కుట్ర అని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. తప్పుల తడకగా ఉత్తమ్ కుమార్ రెడ్డి పీపీటీ ఇచ్చారని విమర్శించారు. హరీశ్‌రావు పవర్‌ఫుల్ ప్రజెంటేషన్‌తో ఉత్తమ్‌కు పీపీటీతో సమాధానమిచ్చారని తెలిపారు. ప్రజలకు అన్ని విషయాలపై సంపూర్ణ అవగాహన ఉందని అన్నారు. కృష్ణా నది నీళ్లను తెలంగాణకు దక్కకుండా చేసేందుకే కుట్రలు కొనసాగుతున్నాయని ఆరోపించారు.అప్పుడైనా.. ఇప్పుడైనా కృష్ణా నీళ్లు పాలమూరుకు రాకుండా చేస్తున్నారని అన్నారు. నిజాం కాలంలోనే కృష్ణా నీటి కోసం అనేక ప్రాజెక్టులకు రూపకల్పన చేశారని తెలిపారు. తుంగభద్రలో నీటి పంపకాలపై 65 టీఎంసీల కోసం 1944లోనే ఒప్పందాలు జరిగాయని అన్నారు. భీమా ప్రాజెక్టును యాదగిరి జిల్లాలో మొదట ప్రతిపాదించారని, ఆలమట్టిని కూడా నిజాం కాలంలోనే ప్రతిపాదించారని తెలిపారు. పాలమూరుకు 174 టీఎంసీల నీళ్లు ఇవ్వాలని నిజాం పలు ప్రాజెక్టులను నిర్మించారని పేర్కొన్నారు. కానీ నిజాం కాలంలో ప్రతిపాదించిన ప్రాజెక్టులను నెహ్రూ ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తుచేశారు. అప్పటి నుంచే తెలంగాణకు అన్యాయం చేయడం ప్రారంభమైందని తెలిపారు. సిద్దేశ్వరం దగ్గర కట్టాల్సిన శ్రీశైలం ప్రాజెక్టును 86 కిలోమీటర్ల కింద కట్టారని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. సిద్దేశ్వరం దగ్గర ఆ ప్రాజెక్టు కట్టి ఉంటే గ్రావిటీ ద్వారా పాలమూరుకు నీళ్లు వచ్చేవని పేర్కొన్నారు. జల విద్యుత్ కోసం కట్టిన శ్రీశైలం నుంచి తెలుగుగంగ పేరుతో నీటిని తరలించారని అన్నారు. తెలుగుగంగ ద్వారా కడప, నెల్లూరు జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు నీళ్లు అందించారని పేర్కొన్నారు. కృష్ణా నదిని మొత్తం మలుపుకు పోయేలా పోతిరెడ్డిపాడును చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీశైలం దరిదాపుల్లోకి రాకుండా చేసే కుట్ర అప్పుడు జరిగిందని.. ఇప్పుడు కూడా జరుగుతోందని అన్నారు. కాంగ్రెస్ లేవనెత్తిన అంశం అసాధ్యమని తెలిపారు.

# పాలమూరు మళ్లీ దివాలా తీసేలా కుట్రలు

మొదటి పేజీ తరువాయి

పాలమూరు జిల్లాను మంత్రులు ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. ఆస్తులు కూడబెట్టుకున్నారు తప్ప రైతులను ఆదుకోలేదని విమర్శించారు. పాలమూరులో పడావు పడ్డ ప్రాజెక్టులపై గులాబీ పార్టీ సమరభేరీ మోగించింది. ఈ క్రమంలో జూరాల ప్రాజెక్టును మాజీ మంత్రులు నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం సందర్శించింది. నార్లపూర్ పంప్‌హౌజ్, రిజర్వాయర్, వ్టటెం పంప్‌హౌజ్, కరివెన రిజర్వాయర్లను సందర్శించారు. ప్రాజెక్టులను పడావు పెట్టిన ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీలో రెండు ట్రిబ్యునల్‌లు ఏర్పాటైనా పాలమూరును పట్టించుకోలేదని అన్నారు. జూరాల ప్రాజెక్టు మొత్తం ఎండిపోతుందని శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగి పంటలకు జూరాల ఆయకట్టుకు క్రాప్ హాలీడే ఇచ్చారని తెలిపారు. ఈ జూరాల నుంచి 70 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తారా అని ప్రశ్నించారు. ఇదేం ప్రభుత్వం? అసలు నీళ్ల మీద సోయి ఉందా అని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేసుకున్నామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తట్టెడు మన్ను తీయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తారా అని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. పాలమూరు మళ్లీ దివాలా తీసేలా కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. పాలమూరును సస్యశ్యామలం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. రాజకీయ కోణంలో చూడకుండా పాలమూరు బాగు చేయాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ 45 టీఎంసీలకు ఒప్పుకోమని తెలిపారు. మా పాలమూరు జిల్లాకు కేటాయించిన నీళ్లు మాకు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు మీరిచ్చిన నీళ్ల కంటే డబుల్ నీళ్లను కేటాయించుకుంటామని తెలిపారు.

# 2047 నాటికల్లా 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ రైజింగ్ సదస్సులో రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఈనెల 19న మరోసారి వరల్డ్ ఎకనమిక్ సమిట్‌కు వెళుతున్నామని, భారీగా పెట్టుబడులు తీసుకొస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. హ్యూసెంట్రియో, సిస్టా ఐటీ సంస్థల ద్వారా వెయ్యి చొప్పున ఉద్యోగాలు వస్తాయని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. జాబ్ క్యాలెండర్ విషయంలో సామాజిక అంశం పరిశీలిస్తున్నామని అన్నారు. ఉబెర్ సంస్థతో ఒప్పందం చేసుకున్నామని.. త్వరలో ఏర్పాటు చేస్తుందని, కాగ్నిజెంట్ సంస్థ ద్వారా 5 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని తెలియజేశారు. పోచారం ఇన్ఫోసిస్ సంస్థ విస్తరణ ద్వారా 17 వేల మంది ఉపాధి, విప్రో సంస్థ విస్తరణ ద్వారా మరో 5 వేల మందికి ఉపాధి ఉంటుందని అన్నారు. 70 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు తెచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని కొనియాడారు. ఇప్పటికే 70 జిసిసిలు రాష్ట్రానికి వచ్చాయని.. సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ లో ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే జినోమ్ వ్యాలీ నాలుగో దశ కూడా పూర్తయిందని, ఐటీ కంటే ఎక్కువగా ఫార్మా ఎగుమతులు జరుగుతున్నాయని అన్నారు. ఏరోస్పేస్, రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు ఎక్కువగా జరుగుతున్నాయని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# వరంగల్ కోట భూ ఆక్రమణలు తొలగించండి

మొదటి పేజీ తరువాయి

ప్రధానంగా వరంగల్ కోట భూములను భారత పురావస్తుశాఖకు చెందినవిగా గుర్తించాలని సూచించారు. కోట భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. కోట భూముల్లోని ఆక్రమణదారులను తొలగించడం గురించి ఈ లేఖలో ప్రస్తావించారు.దాదాపు 250 సంవత్సరాలపాటు కాకతీయుల రాజధానిగా కీర్తిగడించి ఘనమైన చారిత్రక నేపథ్యం, సాంస్కృతిక వైభవంతో అలరారిన ఓరుగల్లు పట్టణం.. తెలంగాణ వారసత్వ సంపదకు నిలయంగా విరాజిల్లుతోందని వ్యాఖ్యానించారు కిషన్‌రెడ్డి. కాకతీయుల కాలంలో ఇతర రాజ్యాల నుంచి ఎదురయ్యే దండయాత్రల నుంచి రాజధానికి రక్షణ కల్పించటం కోసం ఒక ప్రణాళిక ప్రకారం 7 ప్రాకారాలతో వరంగల్ కోటను ఎంతో పకడ్బందీగా నిర్మించారని పేర్కొన్నారు. ఢిల్లీ సుల్తానులు, హైదరాబాద్ నవాబుల దాడులను ఎదుర్కొన్న కోటని అభివర్ణించారు. నేటికీ కాకతీయుల శౌర్య పరాక్రమాలకు ప్రతీకగా నిలిచిందని చెప్పుకొచ్చారు. ప్రతిరోజూ వేలాదిమంది పర్యాటకులు ఈ కోటను సందర్శించి కోటలో దాగి ఉన్న శిల్ప సంపద, నిర్మాణ నైపుణ్యం, వందలాది ఆలయాలు, వాటి నేపథ్యం, కోట ప్రాధాన్యం గురించి తెలుసుకుంటున్నారని వెల్లడించారు కిషన్‌రెడ్డి. పర్యాటకులను మరింతగా ఆకర్షించేందుకు కేంద్రప్రభుత్వం ఇటీవలే సౌండ్, ఇల్యూమినేషన్ లైటింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసిందని వివరించారు. ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎ÷ూఐ) పర్యవేక్షణలో ఉన్న వరంగల్ కోట పరిరక్షణకు, నిర్మాణాల పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన ఈ వరంగల్ కోటకు చుట్టూ ఉన్న 7 ప్రాకారాల్లో ప్రస్తుతం 3 ప్రాకారాలు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు కిషన్‌రెడ్డి. 3 ప్రాకారాలతో పాటు ఇతర ప్రాకారాలను కొంతమంది స్థానికులు ఆక్రమించి కోట భూముల్లో అనేక అక్రమ కట్టడాలు నిర్మించారని వెల్లడించారు. వరంగల్ కోట అధీనంలో ఉన్న ఒక స్మారక ప్రదేశమని, దీనికి సంబంధించిన భూములను ఆక్రమించడం, అందులో అక్రమంగా నిర్మాణాలను నిర్మించడం చట్టరీత్యానేరమని చెప్పుకొచ్చారు. వెంటనే ఆక్రమించిన భూములను ఖాళీ చేయాలని కోరుతూ ఎ÷ూఐ అధికారులు ఆక్రమణదారులకు పలుమార్లు నోటీసులు ఇచ్చారని ప్రస్తావించారు కిషన్‌రెడ్డి. దే విషయాన్ని తెలియజేస్తూ తాను కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఎ÷ూఐ అధికారులు 04.11.2022న అలాగే, ఇటీవల 01.12.2025న వరంగల్ జిల్లా కలెక్టర్‌కి పలుమార్లు లేఖలు రాశానని గుర్తుచేశారు. తాను లేఖ రాసిన కోట భూములను పరిరక్షించటానికి వరంగల్ జిల్లా కలెక్టర్ ఎటువంటి చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# డిజిటల్ డిపాజిట్ల మోసం.. ఫాల్కన్ ఎండీ అమర్‌దీప్ అరెస్ట్

మొదటి పేజీ తరువాయి

ఈ నేపథ్యంలో ఇరాన్ నుంచి ఆయన ముంబయికి చేరుకోవడంతో ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకొని తెలంగాణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. డిజిటల్ డిపాజిట్ల పేరిట అమర్‌దీప్ రూ.850 కోట్లు వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. యాప్ ఆధారిత డిపాజిట్లతో ఫాల్కన్ సంస్థ భారీ కుంభకోణానికి తెరతీసింది. షేర్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో ప్రజలను అమర్ మభ్యపెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. స్కామ్ వెలుగులోకి రాగానే అమర్‌దీప్ దంపతులు దుబాయ్‌కి పారిపోయారు. ఈ కేసులో ఇప్పటికే సీఈవో, అమర్‌దీప్ సోదరుడిని అధికారులు అరెస్ట్ చేశారు.

### నకిలీ వెబ్‌సైట్, యాప్‌లతో మోసాలు

ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ పేరిట భారీ పెట్టుబడి మోసానికి పాల్పడినట్లు సీఐడీ పోలీసులు తెలిపారు. నకిలీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా మోసాలు చేశారని.. ప్రముఖ ఎంఎన్‌సీల పేర్లతో ఫేక్ ఇన్‌వాయిస్ ఒప్పందాలు చేసుకున్నట్లు గుర్తించామన్నారు. దాదాపు 7,056 మంది డిపాజిటర్లు.. అందులో 4,065 మంది బాధితులు ఉన్నారని తెలిపారు. తక్కువ కాలంలో ఎక్కువ పెట్టుబడి వచ్చేలా బాధితులను ఆకర్షించారన్నారు. ఇప్పటి వరకు 11 మంది నిందితులను అరెస్ట్ చేశామని.. వీరిలో డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్‌లు, చార్టర్డ్ అకౌంటెంట్‌లు ఉన్నారని తెలిపారు. 12 ప్లాట్లు, 4 లగ్జరీ కార్లు, నగదు, బంగారం, షేర్లను సీజ్ చేసినట్లు వివరించారు.

# కెసిఆర్‌ను కాదు.. రాహుల్‌ను ఉరితీయాలి

మొదటి పేజీ తరువాయి

శాసనసభ బూతుల సభగా మారిందని మండిపడ్డారు. మంగళవారం నాడు జనగామలో పర్యటించిన కేటీఆర్.. రాహుల్ గాంధీ లీడర్ కాదని.. రీడర్ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. వరంగల్‌లో రైతులకు ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను మరిచిన రాహుల్ గాంధీని ఉరితీయాలని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్టీ కార్యకర్తలకు పలు కీలక సూచనలు చేశారు. 'కుటుంబం అన్నాక గొడవలు ఉంటాయని.. అలుగుడు గులుగుడు ఉంటది, సర్దుకుపోవాలన్నారు. లేదంటే.. కాంగ్రెస్ వాళ్లకు సందు

దొరుకుతది' అని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి నిస్సిగ్గుగా ఇచ్చిన హామీలన్నింటినీ మర్చిపోయారని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్‌ను ఉరి తీయాలని రేవంత్ రెడ్డి అన్న కామెంట్స్‌ని ప్రస్తావించిన కేటీఆర్.. చావునోట్లో తలపెట్టి తెలంగాణను తెచ్చినందుకు కేసీఆర్‌ను ఉరి తీయాలా? అని ప్రశ్నించారు. ఇదే సమయంలో రైతుల అవస్థలను కూడా కేటీఆర్ ప్రస్తావించారు. యాప్‌లో యూరియా దొరకక రైతులు అవస్థలు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటూ ఘాటైన వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు.

# భోగాపురం పూర్తి చేసిన ఘనత బాబుదే

భోగాపురం విమానాశ్రయానికి అనుమతులు తీసుకుని రావడంతో పాటు, పూర్తి చేసిన ఘనత సిఎం చంద్రబాబుకు దక్కుతుందని తెదేపా నేత పట్టాభిరామ్ అన్నారు. పట్టుదలతో విమానాశ్రయం పూర్తి చేయించిన చంద్రబాబు అభినదనీయుడన్నారు. అయితే దీనికి అనుమతులు తెచ్చామంటూ వైకాపా అవాస్తవాలు ప్రచారం చేస్తోందని పట్టాభిరామ్ అన్నారు. 2016లోనే సైట్ క్లియరెన్స్ అనుమతులను సీఎం చంద్రబాబు సాధించారని చెప్పారు. భూసేకరణతో పాటు రైతులకు నష్టం జరగకుండా జీవో ఇచ్చారన్నారు. విమానాశ్రయానికి చంద్రబాబే అంకురార్పణ చేశారని వివరించారు. భోగాపురం విమానాశ్రయంపై పట్టాభి ప్రజెంటేషన్ ఇచ్చారు. భోగాపురం విమానాశ్రయానికి చంద్రబాబు ఎస్‌పీవీ ఏర్పాటుచేశారు. దీనికోసం అధికారులను నియమించారు. చంద్రబాబు క్రెడిట్ చోరీ చేస్తున్నట్లు వైకాపా పేటీఎం బ్యాచ్‌లు ఆరోపిస్తున్నాయి. వైకాపా పాత్ర ఇక్కడ ఏమీ లేకపోయినా తామే చేసినట్లు చెప్పుకొంటున్నారు. విమానాశ్రయం నిర్మాణాన్ని అడ్డుకుంటామని పార్టీ నేతలు గతంలో వ్యాఖ్యానించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు క్రెడిట్ చంద్రబాబుకే దక్కుతుంది.

# మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుదాం

మొదటి పేజీ తరువాయి

పిలుపునిచ్చారు. మంగళవారం సంగారెడ్డిలో స్థానిక, సదాశివపేట మున్సిపల్ ఎన్నికల సమావేశాన్ని జగ్గారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ.. తనను మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి పిలవద్దని కేడర్‌కు స్పష్టం చేశారు. భవిష్యత్ ఎమ్మెల్యే అభ్యర్థి నిర్మలా జగ్గారెడ్డిని ఈ ఎన్నికల ప్రచారానికి పిలవాలని పార్టీ కేడర్‌కు ఆయన సూచించారు. ఈ ఎన్నికల్లో టికెట్ల కోసం తన వద్దకు ఎవరూ రావద్దన్నారు. తాను ప్రచారానికి రాకున్నా.. ఈ జగ్గారెడ్డిని సంగారెడ్డి పట్టణ ప్రజలు నమ్ముతారని విశ్వాసం వ్యక్తం చేశారు. మీ గెలుపు కోసం చేసే వాగ్దానాలన్నీ తానే తీరుస్తానంటూ కేడర్‌కు ఈ సందర్భంగా జగ్గారెడ్డి భరోసా ఇచ్చారు. తన జీవితంలో మొత్తం పోలీసులను ఎదిరించి రాజకీయం చేశానని గుర్తు చేశారు. పోలీసులను అడ్డు పెట్టుకుని తానెప్పుడు రాజకీయం చేయలేదని చెప్పారు.

అధికారంలో ఉన్నామని.. పోలీసులను అడ్డం పెట్టుకొని గెలవాలని చూడవద్దని పార్టీ నేతలకు ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు. ఈ ఎన్నికల్లో టికెట్ల కోసం గాంధీ భవన్‌కు వెళ్లి పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి ఇబ్బంది పెట్టొద్దన్నారు. ఎన్నికల ప్రచారంలో మీరు ఏం హామీలు ఇస్తారో.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి వాటిని నెరవేర్చే బాధ్యత తనదని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

ఈ ఎన్నికల బరిలో పార్టీ నిలబెట్టిన అభ్యర్థులను ఓడించాలని చూసే వారిపై వేటు ఖాయమని నేతలను

జగ్గారెడ్డి హెచ్చరించారు. సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కూన సంతోష్ ఉంటారని ఈ సందర్భంగా జగ్గారెడ్డి ప్రకటించారు. బీసీ, బీసీ మహిళా, జనరల్ ఇలా ఏ కేటగిరి అయినా.. ఆయనే మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఉంటారని స్పష్టం చేశారు. సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ అభ్యర్థిగా షఫీ హఫీజ్ ఉంటారని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు లైన్ క్లియర్

మొదటి పేజీ తరువాయి

చట్ట సవరణతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ వేగవంతం కానుంది. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వానికి పూర్తి వెసులుబాటు వచ్చింది.

కాగా, మున్సిపల్ ఎన్నికల దిశలో అడుగులు వడివడిగా పడుతున్నాయి. ఈ నెలలోనే ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాలని, ఫిబ్రవరిలో ఈ ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సంక్రాంతికి ముందు లేదంటే ఆ తర్వాత కచ్చితంగా షెడ్యూల్ ప్రకటించి ఆ వెనువెంటనే నోటిఫికేషన్ ఇవ్వడానికి రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ నెల 11న లేదంటే 20న షెడ్యూల్ ప్రకటించే అవకాశా లున్నాయి. ఫిబ్రవరి రెండు లేదా మూడో వారంలోగా ఎన్నికల తతంగాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించింది.

# సంక్రాంతి రద్దీకి ప్రత్యేక బస్సులు

సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఏపీ, తెలంగాణ జిల్లాలకు ఆర్టీసీ బస్సులు నడుపుతుందని రంగారెడ్డి రీజియన్ మేనేజర్ శ్రీలత తెలిపారు. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక బస్సులను నడుపుతామని అన్నారు. ఈ మేరకు స్పెషల్ ఆపరేషన్స్‌పై మహాత్మాగాంధీ బస్టాండ్‌లో పోలీస్, ట్రాఫిక్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. బస్సులపై వారికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ రాయలసీమ వైపు వెళ్లే బస్సులు ఆరాంఘర్.. ఉత్తర తెలంగాణకు జేబీఎస్.. విజయవాడ, నల్లగొండ, ఖమ్మం ప్రాంతాలకు ఎల్‌బీనగర్ నగర్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు చెప్పారు.

# కాలుష్య నివారణకు ఇవి పాలసీ అమలు

మొదటి పేజీ తరువాయి

కాలుష్యం తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలని భాజపా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలపై కేంద్రం సబ్సిడీ ఇస్తోందని.. రాష్ట్ర ప్రభుత్వం కూడా అలా ఇస్తోందా? అని ప్రశ్నించారు. ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఈవీలను తక్కువగా వినియోగిస్తున్నారు. రాష్ట్రం మొత్తంపై ఆ తరహా వాహనాలు 70 వేలే నడుస్తున్నాయి. కాలుష్యం తగ్గాలంటే ఈ సంఖ్య పెరగాలి. రోడ్ ట్యాక్స్, వెహికిల్ ట్యాక్స్ మినహాయిస్తూ ప్రభుత్వం ప్రోత్సహించాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలి. ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలని వెంకట రమణారెడ్డి అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల మీద కేంద్రం సబ్సిడీ ఇస్తుంది.. తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల మీద సబ్సిడీ ఇస్తుందా? కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో 40శాతం మాత్రమే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఉందని తెలిపారు.ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ వాహనాలను వాడటం లేదని.. తెలంగాణలో 70 వేల ఎలక్ట్రిక్ వాహనాలే నడుస్తున్నాయని వెల్లడించారు. పొల్యూషన్ తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలి.. రోడ్ ట్యాక్స్, వెహికిల్ ట్యాక్స్ మినహాయిస్తూ.. ప్రోత్సహించాలని కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలని తెలిపారు. ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలని చెప్పారు. త్రీ వీలర్, ఫోర్ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలపై ప్రమోట్ చేయాలని సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. 'హైదరాబాద్‌ను పొల్యూషన్ ఫ్రీ చేయాలంటే.. ఎలక్ట్రిక్ వాహనాలను వాడాలి.. ఎలక్ట్రిక్, సోలార్ ప్యానెల్ తో నడిచే వాహనాలను ప్రోత్సహించాలి.. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలంటే పెద్ద ఎత్తున సబ్సిడీలు కల్పించాలి.. పార్కింగ్ స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి.. ఇవీ పాలసీని తీసుకుని వస్తున్నందుకు ధన్యవాదాలు' అని ఎమ్మెల్యే వెల్లడించారు.హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చాలంటే ఈవీలను వాడాలని చెప్పారు. వినియోగం పెరిగేందుకు పెద్ద ఎత్తున సబ్సిడీలు కల్పించాలని.. పార్కింగ్ స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈవీ పాలసీ తీసుకొస్తున్నందుకు ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# హిల్ట్ పాలసీలో లోపాలు సవరించాలి

మొదటి పేజీ తరువాయి

జీవో 27 చాలా వివాదాస్పదంగా ఉందని అన్నారు. హిల్ట్ పాలసీపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. జీవో లీక్ కావడంపై ప్రభుత్వంలో ఆందోళన ఉంది. టౌన్‌షిప్‌లు, అపార్ట్‌మెంట్‌లు ఉండాలని జీవో 27లో ఉంది. అతితక్కువ ధరకు భూములు ఇచ్చారు. 22 పారిశ్రామికవాడలను అన్యాక్రాంతం చేస్తున్నారు. ఫార్మాసిటీకోసం రైతుల నుంచి సేకరించిన భూములను ఫోర్త్ సిటీకి ఉపయోగిస్తున్నారు. ఆ భూములపై హైకోర్టు అఫిడవిట్ అడిగింది. పరిశ్రమలను మూసివేసేలా ప్రస్తుత పాలసీ ఉంది. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేసే అధికారం ప్రస్తుత ప్రభుత్వానికి ఉంది. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలో తప్పులు ఉంటే వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. అంతేగానీ పరిశ్రమల భూములను రియల్ ఎస్టేట్ భూములుగా మార్చాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. ఇది సరికాదన్నారు. భారత రాష్ట్ర సమితికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 43,342 జీవోలు దాచి పెట్టింది. ప్రస్తుత ప్రభుత్వం 19,064 జీవోలు ఇస్తే.. 3,290 జీవోలు మాత్రమే పబ్లిక్ డొమైన్‌లో ఉన్నాయని ఆరోపించారు.

# అశాస్త్రీయంగా జిల్లాల ఏర్పాటు

మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి మాట్లాడుతూ..మ్యాజిక్ ఫిగర్ కోసమే రాష్ట్రంలో మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టిందని విమర్శించారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్వ్యవస్థీకరణను సరిచేస్తామని పొంగులేటి పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వ తప్పిదాలతో ఒకే నియోజకవర్గంలోని నాలుగు మండలాలు.. నాలుగు జిల్లాల్లో ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై అసెంబ్లీలో చర్చించి అందరి ఆమోదంతో పునర్వ్యవస్థీకరణ చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం జనవరి 7, 2026

# సంచార జాతుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు

**– రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్**



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

తెలంగాణ రాష్ట్రంలోని సంచార జాతుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని అఖిలభారత సమరసత కళా విభాగం రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ అన్నారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని పద్మావతి కళ్యాణ మండపంలో 12 సంచార జాతి కులాల కుటుంబాల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా అప్పల ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో అత్యంత నిరుపేదలు,రాజ్యాంగ ఫలాలు అందకుండా నిర్లక్ష్యం చేయబడిన సంచార జాతి కులాల పట్ల తరతరాలుగా వివక్షత కొనసాగుతున్నదని,అందువల్ల తెలంగాణాలో సంచార జాతి ప్రజల మధ్య సమరసాతా వేదిక సర్వే నిర్వహించి వారి సమస్యలు ప్రభుత్వానికి నివేదిస్తుందని చెప్పారు. సంచార జాతి పిల్లలకు హైదరాబాద్ లో ఉచిత విద్య అందిస్తున్నామని తెలిపారు.ప్రతీ ఆర్థిక బడ్జెట్లో సంచార జాతులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర వైద్యుల సంఘం కార్యదర్శి డా,, సురేంద్ర బాబు మాట్లాడుతూ సంచార జాతుల కుటుంబాలు పిల్లల్ని చదివించాలని, బిక్షటన మానేయ్యాలని, స్వాభిమానంగా బ్రతకాలని పిలుపునిచ్చారు. చలికాలం సందర్భంగా దాదాపు 200 కుటుంబాలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి రామారావు, బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు సంటి మహేష్, రాష్ట్ర నాయకులు గోపు బాలరాజు, సంతోష్ కుమార్, సామాజిక సమరసత కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ ఆదికి ఆహ్వానం



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 8 నుండి 12 వరకు శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలయ ఈవో ఎల్.రమాదేవి ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ను హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిసి ఆరాధనోత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు ఆశీర్వచన అందించి, స్వామివారి ప్రసాదంతో పాటు ఆరాధనోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. శ్రీ త్యాగరాజస్వామివారి ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఆలయ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు.

# అక్రమ ఇసుక తరలింపు... రికార్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వేములవాడ అర్బన్ మండల తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రికార్డ్ అసిస్టెంట్ నిరంజన్ ను సస్పెండ్ చేస్తూ మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఉత్తర్వులు జారీ చేశారు. వేములవాడ మూలవాగు నుండి గత కొంత కాలంగా జరుగుతున్న అక్రమ ఇసుక తరలింపు,అనుమతులకు సంబంధించి జరిగిన అవకతవకల్లో నిరంజన్ పాత్ర కీలకంగా ఉన్నట్టు ఆర్డీవో విచారణలో తేలడంతో, ఆర్డీవో సమర్పించిన నివేదిక ఆధారంగా అతడిని జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు తెలిసింది...

# రోడ్డు ప్రమాదాల నివారణకై వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలి



**– సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారిణి బేతి రజనీ దేవి**

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

రోడ్డు ప్రమాదాల నివారణకై వాహనదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనదారుల జాగ్రత్తలతోనే ప్రమాదాలను నివారించవచ్చని సిరిసిల్ల సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారిణి బేతి రజనీ దేవి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మన్ ఆదేశాల మేరకు సిరిసిల్లలోని ప్రైవేట్ స్కూళ్లలలో రోడ్డు ప్రమాద నివారణ చర్యల గురించి వాహనదారులు తీసుకోవలసిన జాగ్రత్తలు అనే అంశం మీద వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రోడ్డు రవాణా ప్రమాదాలు అనే అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన పాఠశాలలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులను కేటాయించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ మెంబర్ సంగీతం శ్రీనాథ్, సహాయక మోటార్ వాహన తనిఖీ అధికారి పృథ్వీరాజ్ వర్మ, రవాణా శాఖ కానిస్టేబుళ్ల సౌమ్య, రమ్య, ప్రశాంత్ లు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి ఉ ప్రాణ భద్రత మన చేతుల్లోనే

**– జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో అవగాహన కార్యక్రమాలు**
**– రోడ్డు భద్రతపై వ్యాసరచన పోటీలతో విద్యార్థుల్లో చైతన్యం**
**– హుజురాబాద్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కంచి వేణు**



**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ జనవరి 6**

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరూ రహదారి భద్రతపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని హుజురాబాద్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కంచి వేణు స్పష్టంగా పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రతి ఏడాది అనేక మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని, వాటిని నివారించాలంటే ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడమే ఏకైక మార్గమని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా హుజురాబాద్లో రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల ప్రధాన లక్ష్యం విద్యార్థులలో చిన్న వయసులోనే రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం, భవిష్యత్తులో వారు బాధ్యతాయుతమైన రోడ్ యూజర్లుగా మారేలా చేయడమేనని కంచి వేణు తెలిపారు.

వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, ఎరుపు లైట్ వద్ద వాహనాలను ఆపడం, వేగ పరిమితులను గౌరవించడం, పాదచారులు జీబ్రా క్రాసింగ్ను వినియోగించడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కార్లలో సీట్బెల్ట్ వినియోగం ఎంత ముఖ్యమో తమ వ్యాసాల ద్వారా వివరించారు. అలాగే మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వాడటం ఎంత ప్రమాదకరమో చక్కగా విశ్లేషించారు.

కంచి వేణు మాట్లాడుతూ, రోడ్డు భద్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన బాధ్యతగా భావించాలన్నారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నియమాలను నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఇది ఆందోళనకరమైన విషయమని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అలాగే ప్రజా రవాణా వ్యవస్థలో కూడా క్రమశిక్షణ తప్పనిసరిగా ఉండాలని, ఆటోలు, బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని సూచించారు. వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయడం వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని, సరైన పార్కింగ్ విధానాన్ని పాటించాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు ఎంతో కీలకమని పేర్కొంటూ, ప్రభుత్వ సంస్థలు, విద్యా సంస్థలు కలిసి ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని అన్నారు. విద్యార్థులే భవిష్యత్తు పౌరులని, వారిలో ఈరోజే చైతన్యం తీసుకురాగలిగితే రేపటి సమాజం మరింత సురక్షితంగా మారుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో హెల్మెట్ వినియోగంపై విభిన్న రూపాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన వివిధ శాఖల అధికారులను సన్మానించడంతో పాటు, వ్యాసరచన మరియు చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో హుజురాబాద్ తస్మా అధ్యక్షులు వెంకటేశ్వర్, జిల్లా తస్మా నాయకులు కోరం సంజీవరెడ్డి, హుజురాబాద్ పాఠశాల నిర్వాహకులు సతీష్, రాజకుమార్, రవీందర్ రెడ్డి, రవీందర్ కిరణ్, కోటి, రవాణా శాఖ సిబ్బంది, ట్రాన్స్పోర్ట్ కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డ్ బుర్ర సురేష్, విద్యార్థులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మొత్తంగా రోడ్డు భద్రత నియమాలను పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరి చిన్న జాగ్రత్తే పెద్ద ప్రాణాలను కాపాడుతుందని వక్తలు ఈ సందర్భంగా మరోసారి గుర్తు చేశారు.

# హుజురాబాద్ రాజకీయాల్లో కీలక పరిణామం

**– సర్పంచుల ఫోరం అధ్యక్షురాలిగా పత్తి అనిత ఏకగ్రీవ ఎన్నిక**
**– మహిళా నాయకత్వానికి బలమైన గుర్తింపు**



**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్:జనవరి 6**

హుజూరాబాద్ మండల సర్పంచుల ఫోరం నూతన అధ్యక్షురాలిగా వెంకట్రావుపల్లి గ్రామ సర్పంచ్ పత్తి అనిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు సమావేశమై, గ్రామీణ అభివృద్ధి, సర్పంచుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలు వంటి అంశాలపై చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు.

మండలంలోని సర్పంచులంతా ఏకాభిప్రాయంతో పత్తి అనితను అధ్యక్షురాలిగా ఎన్నుకోవడం విశేషం. ఇది ఆమెపై సర్పంచులు ఉంచిన విశ్వాసానికి, ఆమె నాయకత్వ సామర్థ్యానికి నిదర్శనంగా రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఏకగ్రీవ తీర్మానానికి విస్తృత మద్దతు**

పత్తి అనిత నియామకానికి మద్దతుగా చెల్పూర్, ఇందిరానగర్,రంగాపూర్, సింగపూర్
సహా పలు గ్రామాల సర్పంచులు తమ సంతకాలను చేసి తీర్మానాన్ని బలపరిచారు. మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల నుంచి వచ్చిన మద్దతు కారణంగా ఈ ఎన్నిక మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది.

**గ్రామీణ అభివృద్ధికి కొత్త దిశ**

ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం అధ్యక్షురాలిగా ఎన్నికైన పత్తి అనిత మాట్లాడుతూ,
గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సర్పంచుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుళ్లడం, గ్రామస్థాయిలో సంక్షమ పథకాలు పేదలకు అందేలా కృషి చేయడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.
అలాగే సర్పంచుల మధ్య ఐక్యతను పెంచుతూ, మండల అభివృద్ధికి సమిష్టిగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

**శుభాకాంక్షల వెల్లువ**

పత్తి అనిత ఎన్నిక సందర్భంగా ఆమెకు మరియు ఆమె భర్త కృష్ణారెడ్డి దంపతులకు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, సర్పంచులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలోనాయకుడు ప్రణవ్,మండల స్థాయి ప్రజాప్రతినిధులు,
గ్రామాల సర్పంచులు,
పార్టీ నాయకులు, కార్యకర్తలు
పెద్ద సంఖ్యలో పాల్గొని అభినందనలు తెలియజేశారు.

**మహిళా నాయకత్వానికి గుర్తింపు**

సర్పంచుల ఫోరం అధ్యక్షురాలిగా మహిళకు అవకాశం రావడం హుజూరాబాద్ మండలంలో మహిళా నాయకత్వానికి లభించిన గౌరవంగా పలువురు అభిప్రాయపడ్డారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు మహిళలు నాయకత్వ పాత్ర పోషిస్తున్న తీరుకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

**భవిష్యత్తుపై ఆశలు**

పత్తి అనిత నాయకత్వంలో సర్పంచుల ఫోరం మరింత బలోపేతమై,
గ్రామాల సమస్యల పరిష్కారానికి
అభివృద్ధి పనుల వేగవంతానికి
సర్పంచుల హక్కుల పరిరక్షణకు
పటిష్టంగా పనిచేస్తుందనే ఆశాభావాన్ని సర్పంచులు వ్యక్తం చేశారు.

# లక్ష్యంతో చదవండి..జిల్లా కలెక్టర్ పి.ప్రవీణ్య

**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**

విద్యార్థులు ఒక లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రవీణ్య అన్నారు. మంగళవారం జిన్నారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా బాలిక విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. సిలబస్ పూర్తి అయిందా, ప్రాక్టికల్స్ ఎప్పుడు ప్రారంభమవుతున్నాయి, హాల్ టిక్కెట్లు వచ్చాయా, పరీక్ష కేంద్రాల వివరాలు తెలుసుకున్నారా అంటూ ఆరా తీశారు. ఇంటర్ సెకండియర్ విద్యార్థులు ఎంసెట్, నీట్ తదితర పోటీ పరీక్షలకు ఎంతమంది సిద్ధమవుతున్నారో, ఏపరీక్షలు రాయాలనుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు.



సెకండ్ ఇయర్ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి మంచి కళాశాలల్లో సీట్లు పొందేలా కష్టపడి చదవాలని ఆమె విద్యార్థులను ప్రోత్సహించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ నుంచే సరైన ప్రణాళికతో చదువును ప్రారంభించాలని ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు సూచించారు. మీ రియర్ మొత్తం ఇంటర్ చదువు తోనే నిర్ణయమవుతుందని, క్రమశిక్షణతో, లక్ష్యంతో చదివితే తప్పకుండా విజయం మీ సొంతమవుతుందని కలెక్టర్ విద్యార్థులకు హిత బోధ చేశారు. అనంతరం కస్తూర్బా బాలిక విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ పలు తరగతులను కలియతిరిగి పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి సిలబస్ పురోగతి, ప్రతిరోజూ జరుగుతున్న ప్రత్యేక తరగతులు, బోధిస్తున్న సబ్జెక్టుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజన నాణ్యతపై అడగగా విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇతర సమస్యలు ఏవైనా ఉన్నాయా అని ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులు జిల్లాను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపేలా లక్ష్యంతో చదవాలని కలెక్టర్ సూచించారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి అంటూ విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, లెక్చరర్లు, కస్తూర్బా బాలిక విద్యాలయ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రోడ్డు భద్రత..ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

**–ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి**

**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**

జాతీయ రోడ్డు భద్రత మహోత్సవం-2026 ను పురస్కరించుకొని, నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలపై వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు మంగళవారం సంగారెడ్డి మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిభందనలపై అవగాహన కల్పించడం జరిగిందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి తెలియజేశారు.




ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ అన్ని రంగాలలో మగవాళ్ళతో సమానంగా రాణిస్తున్న మహిళలు, మోటార్ రంగంలో కూడా మగవారికి సమానంగా రాణిస్తూ స్కూటీ, కార్ డ్రైవింగ్ కూడా చేస్తున్నారని ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిభందనలు పాటించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షతంగా ప్రయాణం చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ భాయ్, వైస్ ప్రిన్సిపల్ రామిరెడ్డి, కో-ఆర్డినేటర్ డాక్టర్ వరలక్ష్మ, ప్రోగ్రాం ఆర్గనైజర్ శిల్పవల్లి, ట్రాఫిక్ ఎస్ఐ రాములు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక

బుధవారం జనవరి 7, 2026

# హుజురాబాద్ఉజమ్మికుంట మున్సిపల్ పోరులో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయం : వొడితల ప్రణవ్

» గత పాలనలకు భిన్నంగా పట్టణాల అభివృద్ధి దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం
» రాష్ట్రంలోనే టాప్ మున్సిపాలిటీలుగా హుజురాబాద్, జమ్మికుంట రూపాంతరం
» మున్సిపాలిటీలకు రూ.30 కోట్ల నిధులౌ ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టే పాలన
» ఆర్భాటం కాదు, అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

**కరపత్రం ప్రతినిధి హుజూరాబాద్ జనవరి 6**
హుజురాబాద్, జమ్మికుంట పట్టణాల్లో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ధీమాగా ప్రకటించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, పట్టణాల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు.
మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, అలాగే జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్స్‌లో ప్రణవ్ అధ్యక్షతన హుజూరాబాద్ఉజమ్మికుంట పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన ప్రభుత్వ సంక్షమ పథకాలు, వార్డుల



వారీ సమస్యలు, పార్టీ బలోపేతంపై సమగ్ర చర్చ జరిగింది.
**పట్టణాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన రోడ్‌మ్యాప్**
ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ మాట్లాడుతూౌ హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లో గత కొన్ని సంవత్సరాలుగా జనాభా విపరీతంగా పెరిగిందని, దానికి అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడంలో గత పాలకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. మేజర్ గ్రామ పంచాయతీలుగా ఉన్న ఈ ప్రాంతాలు మున్సిపాలిటీలుగా ఎదిగినప్పటికీ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు సరైన పరిష్కారం దక్కలేదన్నారు.
వార్డుల వారీగా డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి అనేక సమస్యలపై గతంలో పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు ప్రారంభించిందని తెలిపారు. ఎస్డిఎఫ్ నిధుల



నుంచి ఇప్పటికే కొన్ని కీలక పనులకు నిధులు వెచ్చించామని గుర్తు చేశారు.
**రూ.30 కోట్ల నిధులతో పట్టణాల ముఖచిత్రం మారబోతోంది**
ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు ప్రకటించిన అభివృద్ధి నిధుల్లో హుజురాబాద్, జమ్మికుంటకు చెరో రూ.15 కోట్లు కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయమని ప్రణవ్ అన్నారు. రెండు మున్సిపాలిటీలకు కలిపి మొత్తం రూ.30 కోట్ల నిధులు రావడం వల్ల పట్టణాల రూపురేఖలు పూర్తిగా మారబోతున్నాయని చెప్పారు. ఈ నిధులతో పట్టణాల్లో పేరుకుపోయిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా మాస్టర్ ప్లాన్ రూపొందించామని, అభివృద్ధి పనులు త్వరలోనే క్షేత్రస్థాయిలో కనిపిస్తాయని ఆయన వివరించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా దశలవారీగా పనులు చేపడుతున్నామని తెలిపారు.
**ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రత్యేక నిధులు**
పట్టణ ప్రజల ఆరోగ్య భద్రతకు కాంగ్రెస్



ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్న ప్రణవ్, హుజురాబాద్, జమ్మికుంట ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రులకు చెరో రూ.15 లక్షలు మొత్తం రూ.30 లక్షల నిధులు కేటాయించి అభివృద్ధి పనులు ఇప్పటికే శరవేగంగా పూర్తి చేశామని చెప్పారు. వైద్య సదుపాయాలు మెరుగుపడడంతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగం చేకూరుతుందని అన్నారు.
**బీజేపీఉబీఆర్ఎస్ పాలనలో ఆర్భాటం తప్ప అభివృద్ధి శూన్యం : ప్రణవ్**
పట్టణాల్లో నేటికీ కనిపిస్తున్న అనేక సమస్యలకు ప్రధాన కారణం బీఆర్ఎస్, బీజేపీ పార్టీలేనని వొడితల ప్రణవ్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రజలను మభ్యపెట్టే ఆర్భాటాలు, ప్రచారాలు తప్ప అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించడంలో ఈ రెండు పార్టీలు ఘోరంగా విఫలమయ్యాయని ఆరోపించారు.
మొన్నటి అసెంబ్లీ సమావేశాల్లో కూడా కనీస సభా మర్యాదలు పాటించని కౌశిక్ రెడ్డి, మున్సిపాలిటీల్లో అధికారంలోకి వస్తే ఏ విధమైన పాలన చేస్తారో ప్రజలే ఆలోచించాలని ప్రశ్నించారు. ఇద్దరు ఎంపీలు, ఒక ఎమ్మెల్యే కలిసికట్టుగా పనిచేసినప్పటికీ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఘన విజయమే ప్రజల తీర్పని గుర్తు చేశారు.
**మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ విజయదుందుభి**
గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీపై చూపిన నమ్మకమే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ పునరావృతం అవుతుందని ప్రణవ్ ధీమా వ్యక్తం చేశారు. వార్డుల అభివృద్ధితో పాటు హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, కేటాయించిన నిధుల వివరాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. ప్రజల మధ్యే ఉండి, వారి సమస్యలపై పోరాడితేనే కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని అన్నారు.
ఈ సమావేశాల్లో హుజురాబాద్, జమ్మికుంట పట్టణ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్టీ బలోపేతంపై సంకల్పం వ్యక్తం చేశారు.

# ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి స్వగృహంలో ఘనంగా

– శ్రీగోదా రంగనాధుల కళ్యాణ మహోత్సవం

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జనవరి 6**
అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్వగృహంలో నిర్వహించినటువంటి శ్రీ గోదారంగానాధుల కళ్యాణ మహోత్సవం సందర్భంగ మాట్లాడుతూ భగవంతుని పూజా కార్యక్రమాలను చేయడం శుభఫలితాలు ఇవ్వడమే కాకుండా ఇంటికి భోగభాగ్యాలు లభిస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ భగవంతుణ్ణి ఆరాధించాలని , ధర్మాన్ని అనుసరిస్తూ అభివృద్ధికి చేయూతనివ్వాలని చెప్పారు. పలు పురాణాలలో తెలపబడినటువంటి పూజా విధానాలను ఆచరించడమే కాకుండా ఇతరులకు తెలియపరచి ఈ మాసంలో జరిగే అటువంటి శ్రీ గోదారంగనాధుని కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించుకుంటారని ఆనందాన్ని ఇస్తుందని చెప్పారు. వైష్ణవ సాంప్రదాయం



ప్రకారం ఈ కార్యక్రమాన్ని చాలా గొప్పగా అట్టహాసంగా వివిధ ప్రాంతాలలో నిర్వహించడం, ఆ ఆనమయితిని కొనసాగించడం జరుగుతుందని గుర్తు చేశారు.
ధనుర్మాసం సందర్భంగా కరీంనగర్ లోని సప్తగిరి కాలనీలో గల శ్రీ కోదండ రామాలయం వారి ఆధ్వర్యంలో ఈ సంవత్సరం నుండి నిర్వహింపబడుతున్న ఇంటింటా శ్రీ గోదారంగనాధుల కళ్యాణ మహోత్సవంలో భాగంగా కళ్యాణ కతువును నిర్వహించడం పూర్వజన్మ సుకృతమని అభిప్రాయపడ్డారు.
వేదమంత్రాల మధ్య సాంప్రదాయబద్ధంగా శ్రేయోభిలాషులు, బంధుమిత్రుల సమక్షంలో నిర్వహింపబడినటువంటి మహోత్సవంలో భాగంగా గృహాన్ని వివిధ రకాల పుష్పాలతో,మాలలతో చక్కగా అలంకరించి కళ్యాణ ఘట్టానికి స్వాగతం పలికారు.
ఈ కార్యక్రమంలో కేఅబశ్రీశ్రీ.గౌతమ్ రావు వికాస తరంగిణి కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు, తుమ్మల రమేష్ రెడ్డి కోదండ రామాలయం గౌరవ అధ్యక్షులు ,వికాస తరంగిణి సభ్యులు మాజీ కార్పొరేటర్, గోనె రాజి రెడ్డి గారు , కోదండ రామాలయం కార్యదర్శి, ముస్కు రాజి రెడ్డి, ఉమా రాణి , సిహెచ్ అరుణ గారు తదితరులు పాల్గొన్నారు.

## రూ.50 వేల లంచం తీసుకుంటూ తహసీల్దార్ పట్టివేత ఉ తెలంగాణ ఏసీబీ సంచలనం



కామారెడ్డి జిల్లా నాగిరెడ్డి పేట మండల తహసీల్దార్ యార్లగడ్డ శ్రీనివాసరావు లంచం తీసుకుంటూ తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ూజదీ) అధికారులకు పట్టుబడ్డారు. ఫిర్యాదుధారుని నాన్న గారి పేరు మీద ఉన్న వ్యవసాయ భూమిని, ఫిర్యాదుధారుని పేరు మీద రికార్డులు మార్పు చేయడానికి అనుకూలంగా సంబంధిత అధికారులకు నివేదిక పంపేందుకు తహసీల్దార్ శ్రీనివాసరావు రూ.50,000/– లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ లంచం మొత్తాన్ని ఒక ప్రైవేటు వ్యక్తి అయిన చిన్నూరి అజయ్ సహాయంతో స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సమాచారం అందుకున్న తెలంగాణ ఏసీబీ అధికారులు ముందస్తుగా వల వేసి, లంచం లావాదేవీ జరుగుతున్న సమయంలో దాడి చేసి తహసీల్దార్‌తో పాటు ప్రైవేట్ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రభుత్వ సేవల కోసం లంచం అడిగే ఏ ప్రభుత్వ ఉద్యోగిపై అయినా కఠిన చర్యలు తప్పవని ఏసీబీ హెచ్చరించింది.

# బిజెపి ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ ముట్టడి

– నిరుపేదల గుడిసెల తొలగింపుపై భగ్గుమన్న ఆగ్రహం
– ప్రభుత్వాల నిర్లక్ష్యనికి నిరసనగా హెచ్చరికలు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జనవరి 6**
జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు రామన్నపల్లె ప్రాంతం రాజకీయంగా ఉద్రిక్తంగా మారింది. గత ముప్పై సంవత్సరాలుగా పెద్దమ్మల కులస్థులకు చెందిన నిరుపేద కుటుంబాలు జీవనాధారం లేక బిక్షటన చేసుకుంటూ కరెంట్ సబ్ స్టేషన్ పక్కనే గుడిసెలు వేసుకుని నిస్సహాయ జీవితం గడుపుతుండగా, ఇప్పుడు అదే సబ్ స్టేషన్ అధికారులు గుడిసెలు ఖాళీ చేయాలంటూ రోజువారీగా వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. పేదలపై జరుగుతున్న ఈ అన్యాయాన్ని సహించబోమంటూ బిజెపి ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ ముట్టడి నిర్వహించడంతో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది.
ఈ సమస్య బిజెపి పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించి, గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలతో కలిసి ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. “మూలుగుతున్న నక్కపై తాటిపండు పడ్డట్టుగా, ఇప్పటికే ఆకలి, అనారోగ్యం, పేదరికంతో అల్లాడుతున్న ప్రజలపై అధికారులు మరో దెబ్బ కొడుతున్నారు. ఇది మానవత్వానికి మచ్చ” అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ సబ్ స్టేషన్ ఎదుట ఘాటు నిరసన చేపట్టారు.
ఈ సందర్భంగా కొలకాని రాజు, ఆకుల రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. “వానాకాలంలో గుడిసెల్లో నీళ్లు చేరి పిల్లలు, మహిళలు తడుస్తున్నారు. ఎండాకాలంలో ఎండలకు కాలిపోతున్నారు.





చలికాలంలో వణుకుతూ రాత్రులు గడుపుతున్నారు. దోమల కాట్లతో మలేరియా, డెంగ్యూ వంటి రోగాల బారిన పడుతున్నా, ఒక్క నాయకుడైనా ఈ పేదల వైపు చూసిందా?” అని ప్రశ్నించారు. పేదల కష్టాలు ఓట్లకు పనికొచ్చే వరకే గుర్తుకు వస్తాయని, ఆ తర్వాత పాలకులకు వారు కనిపించరని మండిపడ్డారు.
గత కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో నిరుపేదలకు ఆశలు చూపి చివరికి మోసం చేసిందని తీవ్ర ఆరోపణలు చేశారు. “కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఇళ్లు కట్టారు గానీ, అవి పేదల దాకా చేరలేదు. అర్హుల జాబితాలు, సర్వేలు అంటూ కాలం గడిపి పేదలను మోసం చేశారు” అని విమర్శించారు.
ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇస్తామని పెద్ద పెద్ద హామీలు ఇచ్చి రెండేళ్లుగా కాలయాపన చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలల కిందట డబుల్ బెడ్ రూమ్ అర్హుల జాబితా ప్రకటించి, ఇప్పుడు కుల ధృవీకరణ పత్రాల పేరుతో మరోసారి నిరుపేదలను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని ఎద్దేవా చేశారు. “ఓట్లు కావాలంటే పేదలు గుర్తుకు వస్తారౌ ఎన్నికలు ముగిసిన తర్వాత మాత్రం పేదల కష్టాలు ఎవరికీ పట్టవు” అని ఘాటుగా వ్యాఖ్యానించారు.
ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని, ధర్మారం ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఈ నిరుపేదలకు వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికలు రాకముందే ఇళ్లను కేటాయించకపోతే, బిజెపి ఆధ్వర్యంలో మరింత ఉగ్ర ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అవసరమైతే నిరుపేదలను నేరుగా ఇళ్లలోకి తీసుకెళ్లే బాధ్యతను బిజెపియే భుజాన వేసుకుంటుందని స్పష్టం చేశారు.
ఈ ఘాటు ఆందోళన కార్యక్రమంలో రాజేష్ ఠాకూర్, బచ్చు శివన్న, కొండ్లె నాగేష్, రాకేష్ ఠాకూర్, బల్సుకూరి రాజేష్, నిరూపరాణి, బూరుగుపల్లి రాము, ఇల్లందుల శ్రీనివాస్, విజిగిరి రవి, ఆవాంచ వెంకటేష్, ఎమనగండ్ల రామస్వామి, పోలు వెంకటేష్, నెల్లి రాజు, నాగపూరి విజయ్, గుర్రం పరుశురాం తదితర బిజెపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక నిరుపేదలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాల నిర్లక్ష్యనికి వ్యతిరేకంగా తమ ఆగ్రహాన్ని ఘాటుగా వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన

– సిరిసిల్ల న్యాయవాదుల సంఘం అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



రాజన్న సిరిసిల్ల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కోనరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సిరిసిల్ల న్యాయవాదుల సంఘం అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులకు చట్టాలు, పిల్లల హక్కులు, బాలపర్యవేక్షణ, బాల్య వివాహాలు, బాలల హక్కుల రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రభుత్వం గాలి పటాలకు ఉపయోగించే చైనా మాంజాపై నిషేధం విధించిందని, కాటన్ దారాలు మాత్రమే వాడాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, న్యాయవాదులు ఆడెపు వేణు, గుర్రం ఆంజనేయులు,కుంట శ్రీనివాస్, తవుటు మధు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆడెపు రాజేశం,ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు న్యాయ సేవాధికార సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాల మేరకు రహదారి భద్రత కార్యాచరణఉ2026పై రూపొందించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

## బద్ది పోచమ్మ తల్లి దర్శనానికి బారులు తీరిన భక్తులు

– అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం
– భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్లు
– అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయ యంత్రాంగం

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామిని సోమవారం



దర్శించుకున్న భక్తులు మంగళవారం శ్రీ బద్దిపోచమ్మ తల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం భక్తులకు బతిపోచమా ఆలయంలో నిరంతర దర్శనం కల్పించినప్పటికీ, మంగళవారం శ్రీ బద్ది పోచమ్మ తల్లి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భక్తుల రాకతో ఆలయ క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి దర్శనానికి భక్తులకు దాదాపు రెండు గంటల సమయం పట్టింది. నెత్తిన బోనంతో అమ్మవారికి నైవేద్యం, కల్లు సాక, బెల్లంసాక సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ సూపరింటెంట్ గుట్ట రాజు ఏర్పాట్లు ఎప్పటికప్పుడు పరిశీలించి ఇబ్బందులు లేకుండా చూశారు. భక్తులకు క్యూలైన్లో మంచినీటి సౌకర్యాన్ని కల్పించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## జోగిపేట 14వ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా బుడోళ్ళల భుజంగం రావు

**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**



సంగారెడ్డి జిల్లా ఆందోలు– జోగిపేట మున్సిపల్ పట్టణంలో 14వ వార్డు కౌన్సిలర్ గా ఇదివరకే ఇదివరకు గెలుపొందిన వివిధ రాజక పార్టీల కౌన్సిలర్లు వారి సొంత ప్రయోజనాల కోసం పనిచేశారని భుజంగం ఆరోపించారు. ఇప్పటికైనా వార్డులో ఉన్న ప్రజలు వార్డు అభివృద్ధి చేసుకోవడం కోసం మీలో ఒకడిగా మీ ముందుకు వస్తున్న, ఇప్పటికే వార్డులో సమస్యలపై స్పందిస్తూ ఎప్పటికప్పుడు అందరికీ అందుబాటులో ఉంటున్నానన్నారు. ప్రజా సేవకే అంకితంగా ఉంటానని ఒక దృఢమైన నమ్మకంతో 14 వార్డ్ స్వతంత్ర అభ్యర్థిగా నన్ను ఆశీర్వదిస్తే తప్పకుండా వార్డు అభివృద్ధి తో పాటు అందరికీ అందుబాటులో ఉండి సమస్యలు తీర్చడానికి కృషి చేస్తానని భుజంగం అన్నారు.